# దేవలోకంలో మహమ్మద్

- పుష్యమి

ఇరాన్ దేశాన్ని పరిపాలించే మహారాజు దగ్గర ఓ తోటమాలి వుంటుండేవాడు. అతనికి మహమ్మద్ అనే కొడుకు వున్నాడు.

ఆ తోటమాలి పనల్లా- రాజోద్యానవనంలో మొక్కలకు, చెట్లకు నీళ్ళుపోయడమే! ఆ తోటలోనే అతను వుండటానికి ఓ కుటీరం ఏర్పాటు చేశాడు రాజు.

మహమ్మద్‌కి పదేహేనేళ్ళు! వాడికి కథలు వినడమంటే ఎంతో సరదా! తండ్రి తోటపని ముగించుకుని యింటికి రాగానే కథలు-కబుర్లు చెప్పమని వేధిస్తుండేవాడు మహమ్మద్.

తోటమాలి కొడుక్కి మహారాజుల కథలు, దేవతల కథలు చెబుతుండేవాడు.

ఆ కథలు వినీవినీ దేవతాలోకంలో విహరించినట్లుగా కలలు కనేవాడు మహమ్మద్.

మహారాజు ఎప్పుడయినా ఆ తోటలో విహరించడానికి వచ్చినప్పుడు ఆ వైభవం, దర్పం చూసి ఎంతో ఆశ్చర్యపోతుండేవాడు మహమ్మద్. తను కూడా మహారాజయితే ఎంత బాగుణ్ణు అని కలలుకంటుండేవాడు.

కాని తనో తోటమాలి కొడుకు! ఎలా మహారాజు కాగలడు? అని అంతలోనే నిరాశపడుతుండేవాడు మహమ్మద్.

ఒకరోజు రాత్రి అతను పడుకోగానే ఓ దేవత వచ్చింది. తన మహిమతో మహమ్మద్‌ని చక్రవర్తిని చేసింది. అతని చినిగిపోయిన వస్త్రాల బదులు ధగధగమని మెరిసే పట్టుబట్టలు ప్రత్యక్షమయ్యాయి. తలపైన బంగారు కిరీటం- దానినిండా మెరుస్తున్న రత్నాలు- వజ్రాలు!

అద్దంలో తన ముఖం చూసుకుని ఎంతో ఆశ్చర్యపోయాడు మహమ్మద్. తన రూపురేఖలు కూడా రాచరీవితో ఎంతో దర్పంగా హుందాగా వున్నాయి.

అతని చుట్టూ సపర్యలు చేయడానికి వందలాది మంది సేవకులున్నారు.

ముందుగా భోజనం తీసుకురమ్మన్నాడు మహమ్మద్.

అతను అంతకుముందు కనీ-వినీ ఎరుగని కనీసం కలలో కూడా వూహించని విందు భోజనం వచ్చింది. సంతృప్తికరంగా ఆరగించాడు. తర్వాత మెత్తటి పట్టు పాన్పుపై హాయిగా నిదరించాడు.

ఆమరుసటిరోజు బంగారురథం అధిరోహించి, విహారానికి బయల్దేరాడు మహమ్మద్. అలా ఆ రథంలో చాలాదూరం వెళ్ళాడు.

చివరికి ఒకచోట రథం ఆపి, కిందకు దిగి, ఆ ప్రదేశంలో తిరగసాగాడు మహమ్మద్. అక్కడ ఎవరూ లేరు. మళ్ళీ రథం ఎక్కాడు.

హఠాత్తుగా తన రథం గాలిలోకి ఎగరడం గమనించి ఆశ్చర్యపోయాడు మహమ్మద్. నలుగురు దేవకన్యలు రథచక్రాలు పట్టుకుని, గాలిలోకి ఎగురుకుంటూ తీసుకెళ్ళడం గమనించాడు.




అలా వెళ్ళి, వెళ్ళి దేవలోకం చేరుకున్నారు. అక్కడ ఓ పెద్ద అందమైన పూలతోట వుంది. అక్కడ మట్టి బంగారు రంగులో మెరుస్తోంది. ఎన్నో రంగుల్లో పూలు వున్నాయి. చెట్లకు పళ్ళు కూడా ఎంతో పెద్దవిగా వున్నాయి.

అక్కడ ఎనమండుగురు దేవకన్యలు వున్నారు. వారి సౌందర్యం మాటల్లో చెప్పలేనిది. వారి శరీరంపై ఎంతో విలువయిన ఆభరణాలు వున్నాయి. వారు మహమ్మద్ రావడం చూసి, ఆనందంతో నర్తించారు.

''నన్నెందుకు యిక్కడకు తీసుకొచ్చారు?'' అనడిగాడు మహమ్మద్.

''మేమంతా మా రాకుమారి ఆజ్ఞ మేరకు మిమ్మల్ని యిక్కడకు తీసుకొచ్చాం. ఇది దేవలోకం! ఇక్కడి సుఖాలు మీరు కలలో కూడా వూహించలేరు.'' అన్నారు వాళ్ళు.

''అవన్నీసరే! ఇంతకూ నన్నెందుకు యిక్కడికి రప్పించారు?'' అనడిగాడు మహమ్మద్.

దేవకన్యలు కిలకిలమని నవ్వారు.

''మీ అందం, ధైర్యసాహసాలు మా రాకుమారికి నచ్చాయి. ఆమె మిమ్మల్ని వలచింది. మిమ్మల్ని పెళ్ళాడాలని యిక్కడకు పిలిపించింది.'' అన్నారా దేవకన్యలు.

అతణ్ణి తమ రాకుమారి వద్దకు తీసుకెళ్ళారు. దేవలోకపు యువరాణి ఎంతో సౌందర్యరాశి. ఆమెను చూసి ఆశ్చర్యానందాలకు లోనయ్యాడు.

మహమ్మద్‌కి రాకుమారికి వివాహమైంది. రాకుమారి రథంలో దేవలోకం అంతా తిరిగాడు మహమ్మద్.

అక్కడి వాతావరణం ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా వుంది. గాలి పరిమళభరితంగా వీస్తోంది. తోటలోని చెట్ల ఫలాల్లో ఎన్నెన్నో ముత్యాలు-

ఆ ముత్యాలను జేబులో దోపుకున్నాడు మహమ్మద్.

అనంతరం మందిరానికి తిరిగొచ్చి షడ్రసోపేతమైన విందు భోజనం ఆరగించాడు. విందు తర్వాత దేవకన్యలు నాట్యం చేశారు.

తర్వాత హాయిగా విశ్రమించాడు మహమ్మద్. ఎంతోసేపు కాకుండానే అతనికి నిద్రాభంగమైంది. ఎవరో పిలిచారు.

కళ్ళు తెరిచి చూశాడు మహమ్మద్. ఎదురుగా తండ్రి నిలబడి వున్నాడు. ''బాబూ, నాకీరోజు వంట్లో బాగో లేదు. నువ్వే తోటలో నీళ్ళుపోయాలి.'' అన్నాడు మహమ్మద్ తండ్రి.

ఆశ్చర్యంతో నమ్మకం కలగక తన దుస్తులకేసి చూసుకున్నాడు మహమ్మద్. చినిగిపోయిన పాత బట్టలే! జేబులు తడుముకున్నాడు- ముత్యాలు లేవు.

''ఓరినీ, అంతా కలేనా?'' అనుకుంటూ తోటవైపు వెళ్ళాడు మహమ్మద్.

★